
*ఎప్పుడో ఒకప్పుడు తప్పుచేయని వారు ఉండరు. కొన్ని తప్పులు పట్టించు కొనవలసిన పని ఉండదు. మరికొన్ని సమసిపోతవి. కొన్ని శిక్ష విధిస్తవి. శిక్ష అనుభవించినా తప్పుగానే నిలిచి పోయేవానిని భరించడం సాధ్యంకాదు.*



**తరువాత** అయిదారు రోజులకు శాస్త్రి ఇంటికి చేరాడు.

"ఆ వచ్చిన పెద్దమనిషి ఎప్పుడు వెళ్లారేమిటి?"

"ఆ రాత్రే."

"ఆ రాత్రి పోవటానికి బండి ఏముందీ?"

"ఏమో! వెళ్లుతున్నానని మాత్రం చెప్పి వెళ్లారు." అంది వినయంగా పద్మ.

* * * *

పద్మ తల్లీ, తండ్రీ ఆ రాత్రి రైల్లోవచ్చారు. అసలే అది రాత్రి బండి. విపరీతంగా వర్షాలు. రైళ్ల వేళకు రావటంలేదు. ఉండి ఉండి గాలి కసరుగా వీస్తున్నది. రాత్రి ఏ ఒంటి గంటకో రైలు వచ్చింది. స్టేషన్‌నుంచి కృష్ణ యిల్లు ఏ రెండు మైళ్లో ఉంటుంది. స్టేషన్ దగ్గర బండ్లయినా లేవు. ఆ వానలో, ఆ చీకట్లో అరవయ్యో పడిలో పడ్డ వాళ్లిద్దరూ నడుచు కుంటూ వచ్చి బయటి తలుపు తట్టి పెద్దగా పిలిచారు. గాలిలో, వానలో, లోపలఇంట్లో, ఎక్కడో, తలుపులు బిగించి నిద్రపోతున్న వాళ్లకు ఎంత సేపటికి వినపడాలో అంతసేపటికే వినపడింది. వినుక్కుంటూ కృష్ణబాబాయి వెళ్లి తలుపు తీశాడు. వాళ్ల లోపలికి వెళ్లి చాలాసేపు బాబాయి గదిలో మాట్లాడారు. బతిమలాడుతున్న వాళ్ళ గొంతులు, కసురుకొని వినుక్కుంటున్న బాబాయి గొంతు వినపడి, పక్కగదిలో నిద్రపోతున్నకృష్ణకు మెలకువ వచ్చింది.

"అయితే ఏమంటావ్ బాబూ?"

"వేరే ప్రయత్నం చేసుకోండి."

"చిన్నతనంనుంచీ అనుకుంటున్న సంబంధం కదా, ఇప్పుడు వేరేచోట ఇస్తే నలుగురూ ఏమంటారు? అదీగాక, ఎక్కడ ఇవ్వటం? ఇంతకాలం కృష్ణకోసం ఆపి ఉంచాం. ఈడేరి అప్పుడే అయిదారేండ్లయింది.... ఇంతకూ పిల్లవాడేమన్నాడు?"

"పిల్లవాడి అభిప్రాయమే ఇది—సరేనా?"

నిర్మొహమాటంగా, కటువుగా వినపడ్డ ఆ మాటల తరువాత నిశ్శబ్దం నెలకొంది.

* * *

కృష్ణనూ, పద్మనూ చిన్నతనంలోనే 'మొగుడూ—పెళ్లాం' అని అందరూ ఆటలు పట్టించేవాళ్లు. అప్పట్లో ఆ రెండు కుటుంబాలూ ఒకేచోట ఉండేవి. మరీ చిన్నతనంలో ఒకరోజు కృష్ణ పద్మను ఎత్తుకొని ఉండగా పొరుగింటావిడ వచ్చి విరగబడి నవ్వుతూ "ఇదేమిటబ్బాయ్? పెళ్లాన్నెత్తుకున్నావ్!" అని ఎగతాళి చేసింది. కృష్ణకు సిగ్గువచ్చి చేతుల్లోవున్న పద్మను వదిలివేశాడు. పద్మ కింద పడిపోయింది. చుబుకానికి రాయి గుచ్చుకుని రక్తం బాగా కారింది. చాలాసేపు ఏడ్చింది. అయినా, కృష్ణ మళ్లీ ఎత్తుకోలేదు. ఆవిడే పద్మను జవిరి ఎత్తుకొని "నేను ఎగతాళిగా అంటే, పిల్లను పడేస్తావా?" అంటూ కృష్ణవేపు చురచుర చూసింది.

చక్రవర్తి

అప్పుడు తగిలిన గాయం ఎప్పటికో మాని చిన్న మచ్చ ఏర్పడింది పద్మకు.

ఆ తరువాత కూడా అందరూ అలాగే నవ్వులాట పట్టించేవాళ్లు వాళ్లిద్దరినీ.

ఆ రెండు కుటుంబాల సాన్నిహిత్యం అలాంటిది. బంధుత్వమూ అలాంటిదే. ఆ రెండు కుటుంబాల వారూ వియ్యం అందుకోవాలన్న కోరికను అంత ఎక్కువగానూ చూపించారు.

అందరికీ చెప్పారు. సరసాలాడుకున్నారు. ఒక విధంగా సంబంధం ఖాయమే ననిపించింది. అందరూ అలాగే నమ్మారు.

కృష్ణ, పద్మ పసితనంలోనే ఒకరిపేరు ఒకరు వింటేనే ఎంతో సిగ్గుపడేవాళ్లు. తమ పసి మనస్సుల్లో చాలా దగ్గరివాళ్లుగా అనుకునేవాళ్లు. పద్మ చిన్ని హృదయక్షేత్రంలో ఈ అనుబంధ బీజం నాటుకుని మొక్కగా మొలిచి, చివుళ్లు తొడుక్కుంటూ, ఆమెకు వయసు వచ్చినకొద్దీ, అదీ వయసు తెచ్చుకోసాగింది.

కానీ, కృష్ణ పెద్దవాడయ్యే కొద్దీ అతని బుర్రలో పెళ్లి విషయమై అనేక ఆలోచనలు పుట్టసాగాయి. తనకూ, పద్మకూ 'పెళ్లి అనే పేరు పెట్టడం' ఎంతో చిన్నతనంగా తోచింది. తను యువకుడు. ఎందరో పిల్లనిస్తామని వస్తున్నారు. పద్మ తల్లిదండ్రులు ముహూర్తం ఎప్పుడని పదేపదే అడుగుతున్నారు. జవాబు చెప్పవలసిన బాధ్యత తన నెత్తిమీదే ఉంది. తాను పద్మనే ఎందుకు చేసుకోవాలి? పద్మను మించిన అందకత్తెలు ఎందరులేరు? తన కళ్ల ముందు సన్నటిజడతో, ముతకవోణీతో తానెంతో పొడుగు పెరుగుతున్నట్లు ముందుకు వంగి నడిచే పద్మ ఏమంత అందకత్తె? ఎవరికి కావాలి? ఈ విశాల ప్రపంచంలో తను అందుకోగలిగిన గొప్ప సౌందర్యం ముందు పద్మ అందాన్ని ఇంచుమించు శూన్యంగా చిత్రించుకొని, పద్మ సంబంధాన్ని మానసికంగా తిరస్కరించాడు.

• • •

ఒకరోజు—

పేరంటం నుంచి ఇంటికి వెళ్తూ పద్మ కృష్ణపిన్నితో వచ్చింది. కాళ్లకు పసుపూ, మెడకూ చేతులకూ గంధం, తలనిండా పూలతో కన్నె ముత్తయిదుగా వచ్చింది. పట్టు జాకెటు, చీర ఆమె అందానికి మెరుగులు దిద్దినట్లున్నాయి. వెన్నెల వెలుగులోంచి వచ్చిన ఆమె, తీవిగా, రాజకుమారిలా ఉంది. చుట్టూ మల్లెలూ, గంధమూ సువాసనలు వలయాలలో ప్రదక్షిణలు చేస్తూ పరిరక్షిస్తున్నట్లున్నాయి. యౌవన ప్రాంగణంలో అడుగుపెడుతున్న ఆమె హృదయ సౌందర్యం గొప్ప భావనా శక్తికి మాత్రమే అందేదిగా ఉంది. బాల్యంనుంచి కృష్ణతోగల అవ్యక్తానుబంధం ఆమె హృదయం నిండా నిండి ఆమె మధుర ప్రకృతిలో పరిమళిస్తూ, ఆమె సుకుమార ప్రవర్తనలో ప్రతిబింబిస్తోంది.

కృష్ణ బయటకు నడిచి ఆరుబయట పారిజాతం చెట్టు దగ్గర నిల్చున్నాడు. పారిజాతం నిలువు నిలువూ మొగ్గ తొడిగి ఉంది. మొగ్గలు అప్పుడప్పుడే విచ్చుతున్నాయి; పద్మ ఊహల్లాగే.

కృష్ణపిన్నితో 'వెళ్లుతున్నా'నని చెప్పిబయలు దేరిన పద్మ, వాకిట్లోకి వచ్చి పారిజాతం దగ్గర నిల్చునివున్న కృష్ణను చూసి, తనకు తెలియకుండానే క్షణం ఆగిపోయింది. ఆమె హృదయం నాట్యం చేస్తున్నట్లయింది. బయటనేగాక, మనస్సులోకూడ వెన్నెలలు విరిసినట్లు అనిపించింది. చుట్టూ పరిమళం మత్తు కలిగిస్తున్నది. విచిత్రంగా పరవశస్థితి ఏర్పడింది. జీవితంలో మొట్టమొదటి సారిగా ఏదో తియ్యని అనుభవానికి దగ్గరగా జరుగుతున్నట్లు అనిపించింది.



ఏకాంతం చిత్రం—ఎలిసెట్టి సూర్యారావు (మద్రాసు-2)

తమ యిద్దర్నీ ఒకటిగా చెయ్యటంకోసం ప్రణయవారిధిగా ఆ వచ్చిన దివ్యక్షణాన్ని నిర్లక్ష్యంగా, చూసీచూడనట్లు కావాలని ఉపేక్షించి జారవిడిచాడు కృష్ణ. మరుక్షణంలో—అదృశ్యమైన ఆ దివ్యక్షణంలాగే— పద్మ అక్కడలేదు.

• • •

కాలం గడచిన కొద్దీ ఎన్నో మార్పులువచ్చాయి. పద్మ తల్లిదండ్రులు మరోఊరికి వెళ్లిపోయారు. కృష్ణ తల్లిదండ్రులు చనిపోయారు.

చివరకు కృష్ణ పద్మ సంబంధాన్ని తిరస్కరించటమేగాక, తరువాత బాబాయి తెచ్చిన ప్రతి సంబంధాన్నీ ఏదో ఒక సాకుతో తోసేశాడు. బాబాయి పోయేవరకు అలాగే జరిగింది. ఆ తరువాత పెళ్లి విషయంలో అతను ఆసక్తి చూపనేలేదు. ఇంచుమించు అతనికి తాత్కాలికంగా పెళ్లి అంటే వైముఖ్యం ఏర్పడిందనే చెప్పవచ్చు.

అతను స్వతంత్రుడు. అతని ఆలోచనలే రహదారులు. ప్రతి విషయంలో మొదట ఉత్సాహం ఉండేది. కొంతవరకూ వెళ్లేటప్పటికి మరోదానిమీద చూపు పడేది. చదువులు, కళలు, రాజకీయాలు, సాంఘిక కార్యకలాపాలు — అన్నీ సగం సగం. ఒకదానిలోంచి మరోదానిలోకి కప్పగంతులు వేస్తూ ఉండేవాడు.

కొన్ని ఏండ్లు దేహపరిశ్రమపట్ల శ్రద్ధ తీసుకున్న ఫలితంగా మెలికలు తిరిగిన కండరాల వేపు గర్వంగా చూచుకునేవాడు. ఒడ్డూ పొడుగూ కలిగిన తన ఆకారాన్ని నిలువుటద్దం నిండా చూసుకొని మురిసిపొయ్యేవాడు. కొంతమంది యువకులు అతన్ని ఆశ్రయించి చుట్టూ తిరుగుతూ ఉండేవాళ్లు. తన గొప్పతనానికి అనేక చిహ్నాలుగా అతనికి తోచేవి. వాళ్లతోపాటు అప్పుడప్పుడూ ఏదైనా అల్లరి చెయ్యాలని విచిత్రమైన కోరిక కలుగుతూ ఉండేది. మొదట లోబడి, అంతా మించిపోయాక పశ్చాత్తాపపడటం జరుగుతూ ఉండేది.

ఇంతకూ, సలక్షణంగా అనుభవించటానికి పూర్వులు సంపాదించి ఇచ్చిన ఆస్తి బోలెడు పడి ఉంది. 'క్షణం తీరికా, దమ్మిడీ ఆదాయం' అవసరంలేని స్వేచ్ఛాజీవితంలో అతను మునిగి పోయాడు.

• • •

కాలం బలంగా ఒక్కొక్క అడుగే వేస్తూ ఒక్కొక్క వింతనూ, విశేషాన్నీ కల్పిస్తూ ఉంటుంది. అలాంటిదే కృష్ణకు శోభతో స్నేహం.

శోభ టెలిఫోన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నది. ఆమెకు తల్లిమాత్రమే ఉంది. చక్కని ఆరోగ్యంతో, అందంగా, అప్పుడే విచ్చిన పువ్వులా, ఆకర్షకంగా ఉంటుంది శోభ. సంభాషణ ద్వారా కూడా అందరినీ ఇట్టే ఆకట్టేది. నాజూకుతనం ఉట్టిపడేటట్లు, నదురూ బెదురూ లేకుండా మొగవాళ్లతో మాట్లాడగలిగేది. అవసరం వచ్చినప్పుడు ఉత్సాహంగా వాదించేది. ఏ విషయంమీదనైనా, ఎంతసేపైనా మాట్లాడగల విషయ పరిజ్ఞానం ఆమెకుంది.

స్త్రీ నన్న బెదురు లేకుండా మందగమనంతో ఆమె ఆఫీసుకు నడిచేవెళ్లేది. ఆమె నడుస్తున్నప్పుడు పమిట ఎడమ భుజంమీదికి జరిగి, బుజపు మలుపులోని గుండ్రనితనాన్ని అంటిపట్టుకొని నిలిచి ఉండేది. ఆమె ఎప్పటికో గాని సవరించుకొనేదిగాదు.

కూతురుకు పెండ్లి చెయ్యాలనేది శోభ తల్లి చిరకాలంగా ఏకరువుపెడుతున్న కోరికల్లో ఒకటి. తల్లి ఆ కోరికను వెలిబుచ్చినపుడల్లా కూతురు విరగబడి నవ్వేది. అయినా, వీలైతే తల్లి కోరిక నెరవేర్చాలన్న ఉత్సాహం ఆమెకు లోపల ఉండేది. తగిన వరుడు దొరకాలి. కొత్తగా స్నేహం కలిసిన కృష్ణ ఉత్సాహం, స్థితిగతులు ఆమెకు నచ్చాయి. అందువల్ల తమ స్నేహం ప్రేమగా మారితే బాగుండునని ఆమె హృదయంలో ఒక ఊహ కలిగింది. దానికి అనుగుణంగా ఆమె తన ప్రవర్తనను

పంచుకుంది.

కృష్ణకు తను కన్న కలలు నిజమౌతున్నా యనిపించింది. నాగరికతా, అందం — తన బాహుపంజరంలోకి వచ్చాయనిపించింది. వివాహాన్ని గురించిన కృష్ణ వెనుకటి అభిప్రాయాలు శోభ ప్రభావంవల్ల రెక్కలువచ్చి ఎగిరిపోయాయి.

ఒక మంచిరోజున వాళ్లిద్దరికీ రిజిస్టర్ వివాహం జరిగింది. మొదటి రోజులు గొప్ప ఆకర్షణలో గడిచాయి. ఒకరిలో ఒకరికి అడుగడుగునా కొత్తదనం కనిపించేది. అలా రెండేండ్లు గడిచిపోయాయి. కాలం గడిచిన కొద్దీ కొన్ని మార్పులు వచ్చాయి. అతని వ్యాసంగాలను, స్నేహితులను చూస్తే ఆమెకు బాధగా ఉండేది. ఆమె ఉద్యోగం చెయ్యటం, ప్రత్యేక విశిష్టతను కలిగి ఉండటం అతనికి యిష్టంగా లేదు. క్రమంగా ఆమె స్వేచ్ఛను సహించటం అతనికి కష్టమనిపించింది. అందుకు తోడుగా ఆమెమీద మోజు తగ్గటం ప్రారంభించి, అతనిలో ఈర్ష్య మొదలయింది.

ఏదో చిన్న విషయంమీద 'అద్దంమీది పెసరగింజలా' వాదం ప్రారంభమయ్యేది. ఆ వాదం కొంతసేపు కొనసాగేది. ఆమె కది సహజమే ననిపించేది. అతనుమాత్రం అది సహించలేకపోయేవాడు. భార్య తనతో వాదించటం తనను అవమానించటంగా భావించి, దెబ్బతిన్న పులిలా రెచ్చిపోయేవాడు. భర్త ఎందుకు రెచ్చిపోతున్నాడో ఆమె కర్థమయ్యేది కాదు. 'చినికి చినికి చివరకు గాలివాన' అయ్యేది. అతని హృదయంలో ఉన్నదేమిటో ఆమెకు అంతుపట్టేదికాదు. ఆమె అనేకవిధాల తెలుసుకోవడానికి ప్రయత్నించి చూసింది. అతను ఏమీ తెలియనివ్వలేదు. అతను ఏదైనా అన్నప్పుడు ఓర్చుకొని చూసింది. అయినా ఆగేవాడు కాదు. చివరకు "ఉద్యోగం మానివెయ్యమంటారా?" అని అడిగింది ఒక రోజు.

"నీ యిష్టం!" అని బయటికి నడిచాడు కోపంగా.

తనలో ఎక్కడో లోపం ఆమెకు అర్థం కాలేదు. ఏమి చేస్తే తను ప్రేమపాత్రురాలౌతుందో కూడా తెలియలేదు. అతను ఎక్కడికి వెళ్లుతున్నాడో, రోజల్లా ఏమి చేస్తున్నాడో ఆమెకు తెలీదు. ఇంటి వ్యవహారాలలో ఆమెకేమీ సంబంధం ఉండటంలేదు. కొన్ని రాత్రిళ్లు అతను ఇంటికే రాడు. ఊళ్లో ఉన్నదీ, లేనిదీ కూడా తెలియని రోజులున్నాయి. ఇంత ఉండీ ఆ యింట్లో ఆమె ఏమీ లేనిదే అయింది. ఆ యింట్లో తన స్థానం ఎక్కడో ఆలోచించే కొద్దీ భయం పట్టుకోసాగింది. తన సంపాదన వరకే ఆమె చూడగలుగుతోంది. కనుక ఉద్యోగం మానటానికి లేదు. ఉద్యోగం మానినా, పరిస్థితులు కుదుటపడేలా లేవు. పైగా మరింత ఇరుకులో పడవలసిరావచ్చు. ఆఫీసులో కూడా ఆమె ఎవరితోనూ మునుపటిలా నవ్వుతూ మాట్లాడటంలేదు. వాద వివాదాల్లో పాల్గొనటంలేదు. ఒక్కసారిగా చల్లబడిపోయిన ఆమెవేపు ఆఫీసులో అందరూ ఆశ్చర్యంగా చూడసాగారు.

ఏమిటి! — ఏదైనా ఒక విషయంమీద తన అభిప్రాయాన్ని వెల్లడించడాన్నికూడా సహించేటంత హృదయవైశాల్యం అతనిలో లేదా? తానెంత ఒదిగి ఉన్నా, అతను సహించలేని స్థితిలోనే ఉంటున్నప్పుడు ఏమిటి చెయ్యటం? తను అతని విషయంలో పడ్డదంతా భ్రమేనా? తన ప్రకృతిని వివాహానికి ముందూ, వెనుకా వేరుపరచి చూసుకుంది. తన అలవాట్లు, ఆలోచనలు, గుణాలు, సంస్కారం — అన్నీ వివాహానికి ముందు అతనికి పరిచయమైనవేకదా? మరి, తనను ఎలా కోరుకున్నాడు? తననుండి అసలు స్వభావాన్ని ఎలా మరుగుపరచి ఉంచగలిగాడో? ఏమిటో, అంతా అయోమయంగా ఉంది! ఆమెకు పెద్ద బెంగ పట్టుకుంది. ఆఫీసులోకూడా మనస్సు సరిగా ఉండటంలేదు. ఇంట్లో సరేసరి. అలా తిరిగిరావటానికి కూడా, భర్త ఏమనుకుంటాడో నన్న పిరికితనం ఏర్పడింది.

ఒక రోజు రాత్రి కృష్ణ జట్కాలో వచ్చాడు. బండినిండా స్నేహితులున్నారు. ఇంచుమించు అందరూ పహిల్వానులే. ఇంట్లోకి వస్తూనే "ఇక మీరు ఇక్కడ ఉండటానికి వీల్లేదు. మీ యిష్టమైన చోటుకు వెళ్లండి" అని తన తల్లితో తనకు వినపడేలా చెప్పి, "నీ కూతురుకు చెప్పు" అన్నాడు గర్జిస్తూ.

"ఎందుకు ఉండటానికి వీల్లేదు?"

"వీల్లేదు — అంతే."

"నేను నీ భార్యను."

"అతిగా వాగక, ముందు నడు."

"నీకున్న సంస్కారం యింతేనని మొదటే ఎందుకు తెలియనివ్వలేదు? వెళ్లుతాను... ఇక్కడ ఈ స్థితిలో ఉండే బదులు ఎక్కడున్నా ఒకటే."

ఈ మాటలు ఆమె ఆలోచించి అన్నవి మాత్రం కావు; హృదయం పగిలిపోతూ ఉంటే ధ్వనిలోంచి వచ్చాయి. చెమటలు కమ్మి శరీరం వణికిపోతున్నది. ఈ వ్యవహారమంతా పరమ అసహ్యం అనిపించి ఆమె భరించలేకపోయింది. ఏడుస్తున్న తల్లిని తీసుకొని, తడబడుతున్న కాళ్లతో బయటికి నడుస్తూ, ఒక్కసారి కృష్ణవేపు చూసింది. అతను క్రూరంగా చూస్తూ భయంకరంగా కనిపించాడు.

అటు ఆమె వెళ్లగానే, స్నేహితులను ఇంట్లోకి రమ్మని సంజ్ఞగా ఈల వేశాడు.

• • •

'రామగిరి' ఆలయాన్ని దర్శిస్తుంటే మహాశిల్పి చేసిన అపూర్వ కళాసృష్టిని ఆరాధిస్తున్నట్లనిపించింది. ఆలయంలో ప్రాకారాల మధ్యా తిరుగుతున్నంతసేపూ మెత్తని సంగీతాన్ని వింటూన్నట్లనిపించింది. స్వామిదర్శనం చేసుకోడం, ఆలయాన్ని చూడటం అయ్యాక అలా కొండమీద వాలుగుచేపులా తిరగడం మొదలుపెట్టాడు. ఆ కొండమీదే ఓ చిన్న ఊరు. అక్కడే కొన్ని సంస్థలు, ఏవో చిన్న చిన్న కార్యాలయాలు. ఎవరినీ ఏమీ అడగకుండా, మౌనంగా అంతా తిరిగి చూశాడు. అయినా తనివి తీరలేదు. ప్రకృతి సౌందర్యాన్నీ, శిల్పకళా ఖండాలనూ చూస్తూన్నంతసేపూ తన్మయుడైపోయాడు. ఆ ప్రకృతినీ, ఆ ప్రదేశాన్నీ అప్పుడే వదిలివెళ్లటానికి అతని మనస్సు ఒప్పుకోలేదు. అంతా అద్భుతంగా ఉన్న స్థితిలో హాయిగా విహరిస్తున్నట్లు అనిపించి, ఇంకో రోజైనా అక్కడ గడపాలనుకున్నాడు.

కాళ్లు ఎలా తీసుకువెళ్లితే అలా తిరిగాడు ఆ కొండంతా. దిగంతవలయాన్ని చూస్తూ, పరవశంగా బండమీదినుంచి మరో బండమీదికి అడుగులు వేస్తున్నాడు. తలనిండా ఆలోచనలు. సృష్టి రహస్యం ఏమిటో! తన జీవితానికి లక్ష్యం?!... తన ఆలోచనా విధానంలో ఎక్కడో 'ఒక పెద్ద వంకర' ఉన్నట్లనిపించింది. దేనిమీదా విశ్వాసం ఉండటంలేదు. నీతి నియమాల పట్ల శ్రద్ధ ఉండటంలేదు. బహుశా వాటిపట్ల శ్రద్ధ అంత అవసరం కాదేమో!



పండ్లోయమ్మ పండ్లు!

చిత్రం—వశిని (పుల్లేటికుర్రు)

మసకచీకట్లో అడుగు జారింది....రెండు బండలమీదినుంచి కిందికి జారాడు. కాలూ, చేయీ దోక్కుపోయాయి. తలకు దెబ్బతగిలి, నెత్తురు కారింది. కుంటుకుంటూ నడవవలసి వచ్చింది. అలాగే నడుస్తున్నాడు.

బాగా చీకటిపడ్డది. ఇంకా ఎక్కడని తిరగటం? సంస్కృత పాఠశాల ఆవరణలో పురాణ కాలక్షేపం జరుగుతూఉండటం కనిపించి, వెళ్లి కూర్చున్నాడు. విషయం 'మేనకా విశ్వామిత్రం'. విశ్వామిత్రుడు మేనక సౌందర్యాన్ని అద్భుతంగా ఊహించి వర్ణిస్తూ 'వెర్రి ఆశల్లో' పడిపోతున్న ఘట్టం. శాస్త్రి చాలా రసవంతంగా చెబుతున్నాడు. వింటూంటే మనస్సుకు చక్కిలిగింత పెట్టినట్లయింది. బాగా చదువు

కున్నవాడిలా ఉన్నాడు శాస్త్రి. మంచి 'వశ్య వాక్కు'. శ్రోతలు ముగ్ధులైపోయారు.

పురాణం అయ్యేవరకు చాలా పొద్దు పోయింది. అందరూ లేచిపోయారు. పండ్లూ, తాంబూలాలూ, దక్షిణా — వేటికవి వేరు పరుచుకొని, మూట కట్టుకుంటున్న శాస్త్రి, ఒక్కడే మిగిలిపోయిన కృష్ణవేపు ప్రశ్నార్థకంగా చూశాడు. యాత్రికుణ్ణనీ, పగలంతా తిరిగి తిరిగి నీరసంగా ఉందనీ, పైగా పడి ఒళ్లంతా గాయాలై బాధగా ఉందనీ, ఎక్కడికీ వెళ్లలేని స్థితిలో ఉన్నందున అక్కడే పడుకుంటానని కృష్ణ అన్నాడు.

శాస్త్రి దయగా చూసి, తన యింటికి రమ్మని బలవంతపెట్టాడు. కృష్ణ ఆయన వెంట వెళ్లాడు. శాస్త్రి పౌరాణికుడుమాత్రమే కాదు, సంస్కృత పండితుడు కూడా. కృష్ణ కోసం వేడినీళ్లు తెచ్చి గాయాలు కడగటానికి సిద్ధపడ్డాడు. కృష్ణ వారించి, తనే కడుక్కొని, ఆయన యిచ్చిన 'అయోడిన్' ను పట్టించుకున్నాడు. తనకు తగిలిన గాయానికి కట్టు కట్టుకోమని సలహా యిస్తూ, దూదీ, గుడ్డపేలికా తెచ్చి యిచ్చాడు శాస్త్రి. అది పాత చీరెలో ఒక మూల చించితెచ్చిన పట్టుపేలిక. ఆయన భార్యదై ఉంటుందని అనుకొని కృష్ణ నవ్వుకున్నాడు.

గాయానికి కట్టు కట్టుకోవడం అయ్యాక, దగ్గర కూచుని పాలూ, పండ్లూ తీసుకొనేలా చేశాడు శాస్త్రి.

లాంతరు వెలుతుర్లో కూచుని ఉన్న కృష్ణను పద్మ దూరంనుంచి చూసింది. ఎప్పుడో మెరిసిన మెరుపు యిప్పుడు — ఏమరిన స్థితిలో పిడుగై తలమీద పడ్డట్లు క్షణం నిశ్చేష్టురాలై, తెప్పరిల్లి, నెమ్మదిగా లోపలికి పోయింది.

కొంతసేపు మాట్లాడి, కృష్ణకు పక్క చూపి, లోపలికి వెళ్లాడు శాస్త్రి. "శాస్త్రి హృదయం ఎంత మంచిదీ!" అని అనుకుని, కృష్ణ నెమ్మదిగా నిద్రపోయాడు.

* * *

ఉదయం పది గంటలకే శాస్త్రి ఇంట్లో భోజనాలు అయిపోతాయి. ఉదయమే కాఫీ తాగి, కట్టుకట్టిన గాయంతోనే, అలా తిరిగి రావటానికి వెళ్లిన కృష్ణ పదిగంటలైనా రాక పోయేటప్పటికి, పాఠశాలకు వేళయిందని శాస్త్రి భోజనంచేసి వెళ్లాడు.

కృష్ణ యింటికి చేరేటప్పటికి పన్నెండైంది. పద్మ వడ్డించింది. వడ్డిస్తున్న పద్మ వేళ్లు కంపించటం అతను గ్రహించాడు. లోపలికి వెళ్లేటప్పుడూ, వచ్చేటప్పుడూ ఓరగా ఆమెవేపు చూశాడు. అతని ఆశ్చర్యానికి అంతులేదు....."ఆమె — పద్మ!" అదిగో! ఆ చిన్ని చుబుకంమీద—మచ్చ! పొడవుగా, నిండుగా, పచ్చని శరీరచ్ఛాయతో, బారెడు జడతో ఎంతో ఆకర్షకంగా కనిపించింది. "ఎంత అందంగా ఉందీ!" అనుకున్నాడు. పలకరిస్తే! ధైర్యం తెచ్చుకొని సంభాషణ ప్రారంభించాడు.

"నేను ఎవరో జ్ఞాపకం ఉందా?" అని ఆమెవేపు ఔత్సుక్యంతో చూశాడు.

యథాలాపంగా మచ్చను వేళ్లతో రాస్తూ "అంత మరుపా!" అంటూ ఆమె లోపలికి వెళ్లింది. మళ్లీ వడ్డించటానికి ఆమె వచ్చినప్పుడు, ఆమె అందమైన కదలికలవేపు ఓరగా చూడకుండా ఉండలేకపోయాడు. అడగకుండానే తనను గురించిన వివరాలన్నీ ఏకరువుపెట్టాడు. రాత్రి శాస్త్రిగారు పురాణం చెప్పడంకూడా ప్రస్తావించి 'మేనకా విశ్వామిత్రం' మీద చిన్న రసవంతమైన వ్యాఖ్యానం విసిరాడు.

కావలసింది వడ్డించి, ఆమె లోపలికి వెళ్లింది. కృష్ణ భోజనం అయింది. "అలా వెళ్లి, ఇంకా చూడవలసినవి చూచివస్తాను" అని లోపలికి వినపడేలా అని, బయటకి పడిచి ఆలయంవేపు వెళ్లాడు.

ఆలయంలోకి వెళ్లి మరోమారు అంతా తిరిగి చూశాడు. రతిరథాలను పరిశీలించి చూశాడు. కల్యాణమంటపంలోని స్తంభాలమీది చిత్రాలను చూశాడు. రాధాకృష్ణుల ప్రేమ, రాసక్రీడలు మొదలైన కుడ్య చిత్రాలను చూశాడు. అలా జలపాతం దగ్గరకు వెళ్లి నిలుచున్నాడు. పూలతోటలో తిరిగాడు. అయినా అతని మనస్సు పద్మను గురించిన ఆలోచనల లోనే ఉంది.

బయట బాగా చల్లబడింది. సాయంత్రం అయింది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. కానీ, ఆలోచనల వేడి అతనిలో అలానే ఉంది. సాయంత్రపు ప్రకృతి అంటే సహజంగా అతనికి చాలా యిష్టం. కొండమీద బాగా ఎత్తుకు వెళ్లి నిలుచుని చూడసాగాడు. సంధ్యాసుందరి ఏ స్వర్గానికో నిష్క్రమిస్తున్నట్లుంది. శిలలు బంగారు గుండ్లలా మెరుస్తున్నాయి. రెండు వేల అడుగుల ఎత్తునుంచి శిఖరం ఆశగా కిందికి చూస్తున్నది. కొండకొనకేసి నిస్పృహగాచూస్తూ నిలబడ్డాడు కృష్ణ.

కొండమీద పడ్డ వాన పడమటివేపునుంచే జారి, వాగై దుమికి కింద పడుతుంది వర్షాకాలంలో. ఇప్పుడు వాగు గుర్తే తప్ప నీరు ఏమీ లేదు. పైనించి వాననీరు జారుడుకు అరిగి నునుపులేలిన రాళ్లు తళతళలాడుతున్నాయి. ఎన్నోచోట్ల ఎన్నోసార్లు అందమైన ప్రకృతిని చూసినా ఎక్కడి ప్రత్యేకత అక్కడికే, ఎక్కడి ఆకర్షణ అక్కడికే సంబంధించి యితరత్రా అలభ్యంగా ఉంటాయనిపించింది.

అతను పెక్కుసార్లు సౌందర్యాన్ని దోసిళ్ల కొద్దీ జుర్రుకున్నాడు. శృంగార వీథుల్లో ఘంటాపథ విహారం చేశాడు. అయినా ఈరోజు అతని మనస్సు ఉన్నవిధం వేరు. ఈ సాయంత్రపు టలంకరణలో — ఈవిన్యాసంలో ఉన్న రామగిరి హొయలుకు వెనుకబలంగా — పద్మ వెనుకకు



న్యాయస్థానం

శిల్పి—జి. ఎల్. నారాయణ్ (బొంబాయి)

తిరిగి లోపలికి వెళ్లినప్పటి అందం తాలూకు ఆకర్షణ నిలచిపోయి ఉంది అతని మనస్సులో

సంధ్యాసుందరి, రామగిరి ప్రకృతి, తీరమూ పారమూ లేని పద్మ సౌందర్యం — అన్నీ కలిసిపోయి అభేదంగా ఉంది. ఈ వలయంలో ఆనందపు లోతులను అందుకోటానికి తన మనస్సు చేస్తున్న పరిభ్రమణంలో ఏదో ప్రమాదం జరిగేటట్టుగా ఉంది. మనస్సునిండా నిండిపోయిన పద్మ రూపంతో తాను ఉక్కిరిబిక్కిరై పోతూంటే, బయట సంధ్యా నృత్యానికి మురిసి, మెరిసిపోతూ రామగిరి!

పెళ్లికాకముందు తనకే యిస్తారనుకుంటున్న రోజుల్లో, పద్మ తనపేరు విన్నప్పుడు పోయిన పసితనపు సిగ్గు వంపు మెరుపులు—ఇప్పటి యౌవనపు అందచందాలనుకూడా తీర్చి దిద్దుకొని—బలమైన జ్ఞాపకాలుగా తోసుక వచ్చాయి. ఇతరుల మనస్తత్వాన్ని , బాగా తెలుసుకోగలనని అతని నమ్మకం. అందమైనవాణ్ణే భర్తగా ఎన్నుకొని, పరిస్థితుల ప్రాబల్యంవల్ల అతను తప్పిపోయి, ఏమాత్రం సౌందర్యాకర్షణ లేని వాణ్ణి భర్తగా పొందిన అందగత్తె మనసు ఎలా ఉంటుందోనని ఊహించి నవ్వుకున్నాడు.

పద్మమీద జాలిపుట్టి, అప్పటికప్పుడే పెద్ద ఆకారాన్ని పొంది, ప్రాణం పోసుకొని, అతని హృదయం మీద బరువుగా కూచుంది. పద్మ అందం "నన్ను ఎందుకు పోగొట్టుకున్నావ్?" అని ప్రశ్నిస్తున్నట్టు హృదయం క్షోభిస్తున్నది. శాస్త్రిని తలచుకొంటే, పద్మకు—ముఖ్యంగా రూపం విషయంలో— చాలా అన్యాయం జరిగినట్లనిపించింది. 'ఇలాంటి విషయాల్లో అన్యాయం ఎంత దూరమైనా వెళ్లవచ్చునా ఏమిటి?' అని అతనికి కోపం వచ్చి, శాస్త్రిమీద ఉన్న కృతజ్ఞతాభావం కొట్టుకపోయింది.

'ఏరు కోసుకపోయినట్లు ఎటో ఒక అటు,

ఏదో ఒక బలమైన వేగం జీవితపు ఒక అంచును కోసుకుపోతుంది. కోసుకపోయినప్పుడు మంచి పొలాలూ, ఊళ్ళూ తుడుచుక పోవచ్చు. పంట కుప్పలూ, పశువులూ, మనుషులతో సహా ఆ మహా వేగంలో ఏ సముద్రంలోనికో తోసుకపోవచ్చు. కొన్ని దశాబ్దాలుగా ప్రవాహమార్గంలో పడి ఉన్న నేల పక్కకు జరిగిపోయి, మంచి బంగారం పండే పొలంగా మారిపోవచ్చు. ఎవరి ఊహాకందే విషయాలివి — అనుభవిస్తే తప్పు? వీటికి న్యాయమంటూ ఏముంటుంది? ' అనుకుంటూ పెద్ద నిట్టూర్పు విడిచాడు మరుక్షణం.

అతని ఆలోచనలతో ఉండగానే, సాయం కాలపు బంగారు రంగు చీకట్లో రంగరించుక పోయింది. కొండ ఒకటే బండలా నల్లగా అయిపోయింది. ఏటిచార ఏమయిపోయిందో కన్ను పొడుచుకున్నా కనపడకుండా మాయమై పోయింది. కృష్ణ ఆలోచనలు కారుమేఘాల్లా ఒరుసుకొని గర్జిస్తున్నాయి. వాటిల్లోంచి మెరుపుల్లా కోరికలు తొంగి చూస్తున్నాయి. బాగా చీకటిపడి ఎంతో సేపయింది. వెనక్కు తిరిగాడు. ఆలయం మీది విద్యుద్దీపాలు కనురెప్పలను అందంగా మూస్తూ, తెరుస్తూ ఉన్నాయి.

అతను నడుస్తున్నాడు. చినుకులు ప్రారంభ మయ్యాయి. గబగబా నడిచి యిల్లు చేరుకొని ఓరగా మేసివున్న తలుపునెట్టి లోపలికి వెళ్లాడు.

"శాస్త్రిగారు వచ్చారా?" అని చొరవగా పద్మను అడిగాడు.

"ఏదో పనిమీద 'వెంటనే బయలుదేరి రమ్మని' వారి తమ్ముడు టెలిగ్రాం పంపారు. ఇప్పుడే రైలుకు వెళ్లారు" అంది.

కృష్ణకు మాంచి ఉత్సాహంగా ఉంది. అటూ యిటూ 'పాదచార్యలు' వేశాడు సంతోషంగా. బయటి వాతావరణంలో మోహాన్ని పెంచేశక్తి బాగా ఉన్నట్లనిపించింది. పద్మ వడ్డించింది. కృష్ణ భోజనానికి కూర్చున్నాడు. ఊళ్ళో తన పలుకుబడీ, కళాభిరుచీ, ఆర్థికస్తోమతూ— ఎన్నో విషయాలు చెప్పుకుంటూ వెళ్లాడు. తనకూ ఆమెకూ వివాహం తప్పిపోవటం చాలా దురదృష్టకరమైన సంఘటనట. ఇప్పటికీ తనలో ఆ చిన్ననాటి అనుబంధం అలాగే ఉందట.

కృష్ణ భోజనం అయ్యేవరకూ పద్మ మౌనంగానే ఉంది. భోజనం అయ్యాక కృష్ణకు నిన్నటి పక్కచూపి, లోపలికి వెళ్లి గొళ్లెం పెట్టుకుంది. కృష్ణ చాలాసేపు ఆలోచిస్తూ పచారు చేశాడు. కూర్చున్నాడు. తరువాత పక్కమీద పడుకున్నాడు. నిద్రరాలేదు. మనస్సులో ఒత్తిడి ఎక్కువయింది. సిగరెట్ వెంట సిగరెట్ కాల్చటం మొదలుపెట్టాడు.

పద్మకూ, తనకూ ఒక 'అనుబంధం' ఉంది. ఆ అనుబంధం ప్రభావం తనమీద ఎంతబలంగా ఉందో, అంతకంటె ఎక్కువ బలంగా ఆమెమీద ఉండి తీరుతుంది. మొదట తమ ఇద్దరిమధ్యా ప్రారంభమైన అనుబంధం, రూపవంతుడు కాని భర్త లభ్యం కావడంతో మరింత బలంగా ఆమెను తనవేపు ఆకర్షించి ఉంటుంది. తను ఇప్పుడు ఆమెకు అందుబాటులో ఉన్నాడు. ప్రతి ఒక్కఘటనా పరిస్థితుల ననుసరించి ఉంటుంది. ఈ సమయాన్ని ఆమె పోగొట్టుకోటం జరగదు. పైగా మహద్భాగ్యంగా భావించుకుంటుంది. తాను కదిపితే చాలు — అంతే.

లేచివెళ్లి, తలుపుతట్టాడు.

"పద్మా! పద్మా!"

పద్మ పలకలేదు.

"పద్మా! పద్మా! తలుపుతియ్యి"

తలుపు తియ్యలేదు.

చాలాసార్లు పిలిచాడు. తలుపు తట్టాడు. నిరీక్షించి చూశాడు ఎంతో సేపు. తల బద్దలు కొట్టుకున్నా తలుపు తీసేట్టు లేదు. నిశ్శబ్దం వెక్కిరిస్తున్నట్లుంది.

తాను యిప్పుడు ఏం చెయ్యాలి? క్షణం ఆలోచించాడు. ఇంతలో బయట పిడుగుపడ్డ పెద్ద చప్పుడయింది. లోపల ఏదో ఒక కుదుపు కుదిపినట్లయి, వెంటనే ఒక నిశ్చయానికి వచ్చి, ఉద్వేగంతో "పద్మా, పద్మా! తలుపు తియ్యవద్దు, వెళ్లుతున్నాను" అన్నాడు.

'తళుక్' అని పెద్ద మెరుపు మెరిసింది. బయటికి నడిచాడు. పద్మ తనను గూర్చి ఎలా ఆలోచించి ఉంటుంది? తాను చేసిన పని ఏమిటి? తనలో ఏదో అస్వాభావికమైన మొరటుతనం ఉన్మాదంగా తల ఎత్తుతూ ఉంటుందేమిటి అప్పుడప్పుడు? కాకపోతే ఇదంతా ఏమిటి? పద్మకు ఏగతి పట్టించాలని తన యీ ప్రయత్నం?

శోభకు తానుచేసిన అన్యాయం జ్ఞాపకానికి వచ్చి తల తిరిగిపోయింది. "ఎన్నిసార్లు తప్పటడుగు వెయ్యటం?" ఎన్నిసార్లు బలహీనత అని సరిపుచ్చుకోవటం?"— అతనిమీద అతనికే అసహ్యం పుట్టింది.

చీకటిలోకి మెరుపులా దూసుకుపోతున్నాడు, తనకు తెలియకుండానే. అడుగులు వెయ్యడంలో అతని ప్రయత్నమేమీ లేదు. తనలో తలఎత్తిన దుష్టశక్తిని పూర్తిగా అణచివేసేటంత ప్రబలమైన మరో గొప్పశక్తి ఏదో ఉద్భవించింది. ఇక ఎలా జరిగినా చింతలేదు.

ఒక్కొక్క బండనే ఎక్కుతున్నాయి కాళ్లు. పైకి, ఇంకా పైకి, కొండకొనకి! దూరంగా ఆలయ శిఖరంమీది విద్యుద్దీపాలు అతణ్ణి కనిపెట్టి చూస్తున్నాయి. ఆలయం నిర్జీవమైన న్యాయమూర్తి ఆకారంలా ఉంది. న్యాయమూర్తి కిరీటంలోని మణుల్లా విద్యుద్దీపాలు మెరుస్తున్నాయి. అంత ఎత్తునా, నిశ్శబ్దమైన చీకటిలో గాలులు ఒంటికి చల్లగా తాకుతున్నాయి.

"పద్మ నీకు ఏమవుతుందని నీ ఉద్దేశం?"

"ఏమీకాదు."

"శాస్త్రి భార్య అని తెలుసా?"

"తెలుసు."

"మరి నీవు చేసింది?"

"గొప్ప—తప్పు."



గోపాలుడు

చిత్రం—వై. శాలయ్య (నారాయణరావు పేట)

"శోభ సంగతి ఏమిటి?"

—కృష్ణ తలవంచుకున్నాడు.

ప్రశ్నలూ అతనిలోనుండే లేచాయి; జవాబులూ అతనే చెప్పుకున్నాడు.

కృష్ణ చూపులు అకస్మాత్తుగా చీకటిని చీల్చి చూడటం ప్రారంభించాయి. కింది అఖాతాన్ని హఠాత్తుగా గుర్తించాడు. ఏటిచారలు అరగదీసిన బండలు, కింద వాగుపడే చోటు —అన్నీ గుర్తుకు వచ్చాయి.

పద్మ తల్లిదండ్రులు నిరాశతో తిరిగివెళ్లిన రాత్రి, ముసలితల్లితో శోభను వెళ్లగొట్టిన రాత్రి—జీవితంలో చేసిన ప్రతి తప్పూ గుర్తుకు వచ్చాయి.

కొండమీదినుంచి కిందకు దుమికే వాగు వేగం తనలోది!

రామగిరి చరణోపాంతంలో ప్రదక్షిణంచేస్తూ పరిభ్రమిస్తున్నది వాగు!

గిరి శిఖరంమీద అదృష్టవశాత్తూ విశ్రమించగలిగిన నీలమేఘం శాస్త్రి!

ఆకాశంలో అరుంధతివలె ప్రకాశిస్తూ పద్మ!!

తాను ఎక్కడ నిల్చుని ఉన్నదీ-అతనికి తెలిసే ఉంది. తన ప్రాణాలను ఇప్పటికీ రక్షించుకోవచ్చుకూడా. కానీ, అదేమీ అతనికి పట్టినట్లు లేదు. కదులుతున్న కాళ్లను అతను అదుపులో పెట్టలేదు.

"పద్మ, శోభ!! స్త్రీలోని సర్వమూ అయిన సహనమూ,పవిత్రతా! వానిముందు...అల్పత్వం!... ఛీ! ఛీ!! ఇంతగా మించిపోయిన వ్యవహారంలో నన్ను నేను క్షమించుకోవటమా?"

రామగిరి పాదాలమీదకు దూకుతున్న వాగుకూ, తనకూ గల సామ్యం తనను సవాలు చేస్తున్నట్లుంది!

........అడుగు ముందుకు పడిపోయింది!!

......కిందికి, బండమీదినుంచి కిందికి, పర్వత శిఖరంమీదినుంచి కిందికి, అఖాతంలోకి, రామగిరి చరణోపాంతానికి!!!! ★